సోయా.. అమ్ముకునేదెలా..?

- ఒక్కో రైతు నుంచి పది క్వింటాళ్లే కొంటామంటున్న మార్క్‌ఫెడ్
- దళారులకు విక్రయించి నష్టపోతున్న అన్నదాతలు

ఇబ్రహీంపట్నం: కష్టపడి పంటలు పండించిన రైతులకు కొనుగోలు కేంద్రం ప్రారంభించినా.. అధికారులు నిబంధనలు పెట్టడంతో రైతులు కొనుగోలు కేంద్రంలో అమ్మక దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో సుమారు 450 ఎకరాల్లో రైతులు సోయాబిన్ పంట పండించారు. ఈ పంటను అమ్ముకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు విన్నవించారు. ఈనెల 19న ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సింగిల్‌విండో ద్వారా మార్క్‌ఫెడ్ డీఎం హబీబ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగాం రాజు ప్రారంభించారు. కానీ మార్క్‌ఫెడ్ అధికారుల నిబంధనలతో రైతులకు


దళారులకు అమ్ముకుంటున్న రైతులు

ప్రయోజనం లేకుండా పోతోంది.

10 క్వింటాళ్లే కొనుగోలు

సోయాబిన్ పండించిన రైతువి 10 క్వింటాళ్ల మాత్రమే మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేయడంతో.. ఒక్క రైతు 30 క్వింటాళ్లు పండించిన సోయాలను అమ్ముకునే పరిస్థితి లేదు. ఒక్కో రైతుకు ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,892 కాగా.. మార్క్‌ఫెడ్ అధికారుల నిబంధనల వల్ల రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లక కళ్లాల వద్దే దళారులకు క్వింటాల్‌కు రూ.4,300కు అమ్ముకొని నష్టపోతున్నారు.

నమోదు చేయని అధికారులు

మండలంలో సోయా పంటను పండించిన కొంత మంది రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు నమోదు చేయకపోవడంతో కొనుగోలు కేంద్రంలో అమ్ముకునేందుకు రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సోయా పండించిన రైతులు కొనుగోలు కేంద్రంలో అమ్ముకునేందుకు వెళ్తే.. ఆన్‌లైన్‌లో సోయా పంట వేసినట్లు చూపకపోవడంతో పంట ఉత్పత్తులను అమ్ముకునే అవకాశాన్ని కోల్పోయారు. పంట వివరాల నమోదు చేయడంలో వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ రైతుల పంటను దళారులు మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆరుగాలం కష్టించి పండించిన సోయా పంటకు మద్దతు ధర రాక సదరు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట వివరాలు నమోదు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోచమ్మ తల్లికి బోనాలు



రాయికల్: కిష్టంపేట గ్రామంలో పోచమ్మ తల్లికి మహిళలు గురువారం బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు తిరుపతిగౌడ్, ఆడెపు హరి, కృష్ణ, వెంకటేశ్, రాజిరెడ్డి, జాన గోపి, శేఖర్, చాంద్‌పాషా, ముఖీద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమెప్పుడో?


పెగడపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం

పెగడపల్లి: మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల కేంద్రంతోపాటు మండలంలోని గ్రామాల్లో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వెల్లువలా వస్తోంది. ధాన్యం రాశులతో ఆయా కొనుగోలు కేంద్రాలు నిండిపోతున్నాయి. మండలంలోని 23 గ్రామాల్లో సుమారు 26 వేల ఎకరాల మేరకు వరి పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ప్రసుత వానాకాలంలో సుమారు 4 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడులు రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా మండల వ్యాప్తంగా మొత్తంగా 23 వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వరికోతలు ప్రారంభం కావడంతో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో కేంద్రాల్లో స్థలాల కొరత ఏర్పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ అకాల వర్షం కురిస్తే ధాన్యం తడిసి కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజలకు చేరువయ్యేలా విధులు నిర్వహించాలి


బీర్‌పూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కకు నీరు పడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

సారంగాపూర్: ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీసులు తమ విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులు, రైటర్, రికార్డు గదులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానంలో అమలులో భాగంగా స్టేషన్‌లోని ప్రతి పోలీస్ సిబ్బంది ఫైల్స్‌పై అవగాహన కలిగి ఉండడం, వాటిని క్రమపద్ధతిలో పెట్టుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఏ గదిలో ఏది అందుబాటులో ఉందో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారితో బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. పెండింగ్ కేసులపై రివ్యూ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్


కోరుట్ల: చెక్కులు అందజేస్తున్న నాయకులు

కోరుట్ల: పేదలకు అండగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని కోరుట్ల సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం కోరుట్లలో నియోజకవర్గానికి చెందిన 90 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు రూ.28లక్షల విలువైన చెక్కులను అందించారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. కనీసం రేషన్ కార్డు, పింఛన్లివ్వకుండా అవస్థలపాలు చేశారన్నారు. కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, నాయకుడు అన్నం అనిల్, వైస్ చైర్మన్ గడ్డమీద పవన్, కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, నాగభూషణం, ఆడెపు మధు, సంగలింగం, అక్బర్, సోగ్రాబీ, మహిపాల్‌రెడ్డి, కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్లు అంజిరెడ్డి, పుష్ప, రాజు, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, చిట్టాపూర్ బుచ్చిరెడ్డి, సత్యనారాయణ, మ్యాకల నర్సయ్య, రంజిత్‌గుప్త, మచ్చ కవిత, జగన్నాథ్ లక్ష్మణ్, వాసీద్, అయూబ్ పాల్గొన్నారు.

మల్లాపూర్: కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తుందని పీసీసీ డెలిగేట్ సభ్యుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం ముత్యంపేటలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపల్లి రామాగౌడ్, మాజీ ఉప సర్పంచ్ అల్లూరి మహేశ్‌రెడ్డి, ఏలేటి వెంకట్‌రెడ్డి, కట్కం నర్సారెడ్డి, బొల్లం రఘు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గల్ఫ్ కార్మికులను ఆదుకుంటామని ఎన్నో హామీలిచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాకు రూ.1.40కోట్లు మంజూరు చేసిందని, వీటిని బాధిత కుటుంబాలకు అందజేస్తామని అన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్


కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కథలాపూర్: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. కథలాపూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. విద్యార్థులకు పోలీస్ శాఖ విధులపై వివరించారు. పోలీస్ స్టేషన్‌లోని అన్ని విభాగాలను విద్యార్థులు పరిశీలించి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఎస్సై నవీన్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ మధుకర్, కానిస్టేబుళ్లు నవీన్‌కుమార్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

కోరుట్ల: పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. కేరళ హైస్కూల్ విద్యార్థులు స్టేషన్‌ను సందర్శించారు. శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు తదితర అంశాలను విద్యార్థులకు ఎస్సై శ్రీకాంత్ వివరించారు. ప్రిన్సిపాల్ సెలీనా, కరస్పాండెంట్ ఖారీ, పోలీసులు పాల్గొన్నారు.

మల్లాపూర్: చట్టాలపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కల్గి ఉండాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. తుపాకుల పనితీరును విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ హెడ్ కానిస్టేబుళ్లు కోటేశ్వర్‌రాజు, కలీం, నీలినాయక్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం


కథలాపూర్: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కథలాపూర్: చింతకుంట గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు చేయగా.. 30 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పిడుగు సంజీవ్‌రెడ్డి, ప్రతినిధులు నాగం భూమయ్య, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, పరమేశ్వర్, జనార్దన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కోరుట్ల రూరల్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి వైద్యులు మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కోరుట్ల సివిల్ కోర్టు జడ్జి అరుణ్‌కుమార్ ప్రారంభించారు. అసోసియేషన్ కుటుంబ సభ్యులు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్‌రావు, కార్యదర్శి సుతారి శ్రీనివాస్, తోట ఆంజనేయులు, రాజేశ్ ఖన్నా, చాప కొషోర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న రమాదేవి

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘ సభ్యుల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో రూరల్, అర్బన్ మండలాల మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రెండు మండలాల్లో మహిళా శక్తి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, మరియ, రవీందర్, సాగర్, శ్రీనివాస్, మారు సత్తవ్వ, దేశవేని గంగభవాని పాల్గొన్నారు.

క్లుప్తంగా

అల్లీపూర్ సబ్ సెంటర్ తనిఖీ


రిజిస్టర్ చూస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

రాయికల్: అల్లీపూర్ గ్రామంలోని సబ్ సెంటర్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తనిఖీ చేశారు. సబ్ సెంటర్‌ను పరిశీలించి రోగులకందుతున్న సేవలపై ఆరా తీశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల జగిత్యాలలో 2024–25 మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గునుక శ్రీలత తెలిపారు. ఈ కళాశాలలో ఆరు గ్రూపులకు ప్రవేశముంటుందని, బీఎస్సీ, ఎంపీసీ, ఎంఎస్సీ, సీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ, బీఎస్‌ఎఫ్ ఎస్‌క్యూసీ, బీసీఎఫ్ ఎస్‌క్యూసీ, బీకాం సీఏ మొత్తం గ్రూపుల్లో 40 సీట్లున్నాయన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో జగిత్యాలలోని గొల్లపల్లి రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రాయికల్: ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పీజీటీ బోటని పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంతోష్ గురువారం తెలిపారు. ఎమ్మెస్సీ బోటని, బీఈడీ అర్హత ఉన్నవారు ఈనెల 28 లోపు దరఖాస్తు చేసుకోవాలని, 29న డెమో నిర్వహించనున్నట్లు చెప్పారు.

చెట్టుపై నుంచి పడి స్వీపర్‌కు గాయాలు

కొండగట్టు: శ్రీఆంజనేయస్వామివారి ఆలయంలో ముత్యంపేట గ్రామానికి చెందిన దూడ లక్ష్మణ్ స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం ఆలయం ఎదురుగా ఉన్న రావి చెట్టు మీదికి తమ ఆధార్ కార్డు కోతి ఎత్తుకెళ్లిందని భక్తులు లక్ష్మణ్‌కు చెప్పారు. చెట్టు మీదికి వెళ్లి కార్డును భక్తులకు అందించాడు. చెట్టు నుంచి దిగే క్రమంలో తేమ ఎక్కువగా ఉండటంతో జారి పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా.. వెంటనే అంబులెన్స్‌కు సమాచారమందించి ఆసుపత్రికి పంపించారు. సంబంధిత ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. వేరే వాళ్లకు బదులుగా లక్ష్మణ్ వచ్చాడని, భక్తుల కోసం చెట్టు పైకి ఎక్కి పడ్డాడన్నారు.

గుంతలు పూడ్చివేత

మల్యాల: మండల కేంద్రం నుంచి మల్యాల అడ్డరోడ్డుకు వెళ్లే దారిలోని గుంతలను ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో మట్టి పోసి పూడ్చారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఇటీవల భారీ వర్షాలకు గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల పోలీసులు చొరవ తీసుకొని గురువారం గుంతల్లో మట్టి పోసి చదును చేశారు.

ట్రాన్స్‌కో డీఈగా గోపికృష్ణ

జగిత్యాలజోన్: జిల్లా విద్యుత్ సంస్థ కన్‌స్ట్రక్షన్ జగిత్యాల డివిజనల్ ఇంజినీర్‌గా గోపికృష్ణ నియమితులయ్యారు. గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఐఎన్‌టీయూసీ నాయకులు రాంజీనాయక్, ఎస్.బాలు, రాజమల్లు, రవీందర్, రఘువీర్‌రెడ్డి, రంజిత్ పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.

పంటలపై డిజిటల్ సర్వే

ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ అగ్రి మిషన్‌లో భాగంగా డిజిటల్ పంటల సర్వేను గురువారం ఏఈవోలు ప్రయోగాత్మకంగా చేపట్టారు. పంటలను ఆ సర్వే నంబర్ వద్దకు వెళ్లి సాగు చేసిన పంట వివరాలతోపాటు ఆ పంటల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. ఏవో రాజ్‌కుమార్, ఏఈవోలు రవళిక, సాగర్, వినోద్, నవిత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఎంప్లాయ్ ఐడీ కేటాయించాలి

జగిత్యాల: డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు ఎంప్లాయి ఐడీ కేటాయించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు అన్నారు. గురువారం జిల్లా ట్రెజరీ అధికారికి వినతిపత్రం అందజేశారు. ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీ కమిటీ రద్దు

మల్యాల: బీజేపీ మండల కమిటీని రద్దు చేస్తూ కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చిన్నారికి అభినందన

జగిత్యాలజోన్: కూచిపూడి నాట్యంలో ప్రతిభ కనబర్చిన చిన్నారి జంగిలి ప్రవిష్ణను గురువారం పలువురు అభినందించారు. కేరళ రాష్ట్రంలోని తివేండ్రంలో గల పద్మనాభస్వామి దేవాలయంలో ఇటీవల జరిగిన నాట్యోత్సవాల్లో బహుమతులను గెల్చుకుంది. గురువారం అకాడమి హైట్స్ పాఠశాల ప్రిన్సిపాల్ జీవన్‌రెడ్డితోపాటు పట్టణ ప్రముఖులు, ఉపాధ్యాయులు అభినందించారు.

జగిత్యాల: జగిత్యాలకు చెందిన విద్యార్థి సంహిత ఎంబీబీఎస్‌లో 1,746 ర్యాంక్ సాధించగా.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గురువారం విద్యార్థిని అభినందించారు.



సారంగాపూర్: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం జరిగినా బస్టాండ్‌లో బస్సులు ఏనాడూ ఆగడం లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ భవనం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుతోంది. భవనం వెనక వైపు గోడను ఆనుకొని పిచ్చిమొక్కలు, పెద్ద చెట్లు పెరిగి భవనానికి నష్టం జరుగుతోంది. మూత్రశాలల్లో పిచ్చిమొక్కలు మొలచి పెరగడంతో గోడలు పగుళ్లు చూపుతున్నాయి. పైపులైన్లు, మ్యాన్‌హోళ్లు శిథిలమవుతున్నాయి. ఆర్టీసీ అధికారులు దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సునీత, డిపో మేనేజర్, ఆర్టీసీ, జగిత్యాల, సెల్ నం.: 9959225925

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలు

కథలాపూర్: తాండ్ర్యాల, కథలాపూర్ గ్రామాల్లో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదించినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. కథలాపూర్‌లో గుంటు పెరమాండ్ల దేవాలయం వద్ద, తాండ్ర్యాల గ్రామంలో పంచాయతీ సమీపంలో నిర్మిస్తామన్నారు.

హోటళ్లు, దుకాణాల తనిఖీ


జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: పట్టణంలోని పలు హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాల్లో మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని జరిమానాలు విధించారు. హోటళ్లు, బిర్యానీ పాయింట్లలో వినియోగించే నూనె పాత్రలు శుభ్రంగా లేకపోవటంతో జరిమానా విధించారు. రూ.12,500 జరిమానాలు విధించినట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, జగదీశ్, రమేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో గురువారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	06	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	10	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	06	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	03	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	05	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	09	560
నందీశ్వర సూట్స్	03	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	06	448
పార్వతీపురం స్పెషల్	08	672
పార్వతీపురం సాధారణ	10	336

- వేములవాడ

ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా


మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

మల్యాల: తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తామని యాదగిరి శేఖర్‌రావు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల మద్దతు తనకుందని అన్నారు. మండల కేంద్రంలో గురువారం ట్రస్మా మండలాధ్యక్షుడు పోకల నరేశ్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా శేఖర్‌రావు పాల్గొన్నారు. బోగ ప్రసాద్, శ్రీధర్‌రావు, పి.కిషన్‌రావు, పోకల నరేశ్, రాజు, దయానంద్, అనిల్, సత్యం, తిరుపతి, విజయన్, సుమన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల అనుమతితోనే ఇసుక తరలింపు


సారంగాపూర్: అధికారుల అనుమతులతోనే సీజ్ చేసిన ఇసుకను డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తరలిస్తున్నట్లు బీర్‌పూర్ మండల ఆర్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. చిన్నకొల్వాయి శివారుల్లో అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా సీజ్ చేసిన ఇసుకను తరలించడంపై పలు గ్రామాల ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విమర్శలు చేస్తున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆర్ఐ వివరణ ఇస్తూ.. నూకపల్లి, అనంతారం తదితర ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అక్టోబర్ 17 నుంచి డిసెంబర్ 16 వరకు ఇసుకను తరలించడానికి కలెక్టర్ అనుమతులిచ్చారని తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం


శివమారుతిరెడ్డిని సన్మానిస్తున్న ఆర్‌ఎంపీలు

కోరుట్ల రూరల్: అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివమారుతిరెడ్డి ఆల్ ఇండియా సివిల్స్‌లో 132వ ర్యాంకు సాధించి ఒరిస్సాలో ఉద్యోగంలో జాయినై మొదటిసారి అయిలాపూర్ రాగా.. కోరుట్ల ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. శ్రీపతి, శ్రీనివాస్, సూర్యప్రకాశ్, రామ్‌మోహన్, శంకర్, నజీబుల్లా, నయిమ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ప్రతిభ


బాలికలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ధర్మపురి: ఎస్‌జీఎఫ్ అండర్–19 కబడ్డీ పోటీల్లో మగ్గిడి గురుకుల పాఠశాలకు చెందిన బాలికలు ప్రతిభ కనబర్చారు. ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, అధ్యాపక బృందం బాలికలను అభినందించారు.

27న బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాలటౌన్: ఈనెల 27న జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్–14, అండర్–17 బాలబాలికలకు బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరాం నాయక్ తెలిపారు. అర్హత పత్రాలతో రిపోర్ట్ చేయాలని కోరారు.